కథ

బస్టాపులో నిలబడి దూరంగా వస్తోన్న బస్సు తనెక్కేదేనా? అని దీక్షగా చూస్తున్న శ్వేత, ఆ పిలుపుకి ఒక్కసారి ఉలిక్కిపడింది. వెంటనే తల తిప్పి చూసింది. ఎదురుగా చైతన్య దిగాలుగా, నీరసంగా ఏదో జబ్బు పడి లేచినవాడిలా... పేరుకు తగ్గట్లు చైతన్యంతో హుషారుతో వుంటానని అందరితో చెప్పుకునే చైతన్యని అలా చూడడంతోనే శ్వేత కళ్లల్లోకి నీళ్లొచ్చాయి. "అన్నయ్యా! ఏంటిలా అయిపోయావ్?" అంది గద్గదస్వరంతో అతని చేతిని పట్టుకుంటూ. ఆ మాటకే ఒక్క సారిగా కదిలిపోయాడు చైతన్య.

# ఇన్సిడెంట్

## వాలి హిరణ్మయీదేవి

"అరగంట నుంచీ తర్జన భర్జనలు పడుతున్నాను. నిన్ను పలకరించాలా వద్దా అని" అన్నాడు మెల్లగా. "మొన్న బాబ్జీనిలాగే పలకరిస్తే నేనెవరో తెలీనట్లు చేయి విదిలించుకొని వెళ్లిపోయాడు చిన్నూ. నేను కావాలనే ఇదంతా చేశానా? నన్నలా పరాయివాడిలా ఇంకా చెప్పాలంటే ఓ పరమ శత్రువును చూసినట్లు చూస్తే తట్టుకోలేకపోయాను" అన్నాడు కళ్ల నుంచి నీళ్లు జలజలా రాలుస్తూ....

"వాడింకా చిన్నవాడు కదన్నయ్యా" అంది శ్వేత తమ్ముణ్ని వెనకేసుకొస్తూ.

"వాడు చిన్నవాడే. కానీ అక్క దగ్గరకెడితే నా మొహం మీదే తలుపేసేసింది. ఇక బాబాయి సంగతి సరే సరి. ఆయన ముందు పడడానికి నాకే ధైర్యం చాల్లేదు. నాన్న వెడితేనే పలకరించలేదట."

"ఏంటీ? పెద్దనాన్న, నాన్న ఆఫీసుకి వెళ్లారా? ఇంటికొచ్చిన పెద్దమ్మ, పెద్దనాన్నలతో మాట్లాడని సంగతే తెలుసు నాకు"

"ఆఫీస్‌కి వెడితేనైనా కనీస పలకరింపు వుంటుందని వెడితే, మొహం తిప్పుకొని వేరే డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లిపోయారట. మొన్న మనకు తాత వరుస వుతార్లే, ఆయన కొడుకు చనిపోతే నాన్నక్కడికి వెళ్లాడు. అక్కడ నాన్నని చూసి నిలబడకుండా వెళ్లిపోయారట బాబాయ్. ఎర్రటి ఎండలో నన్ను చూసే అలా వెళ్లిపోయాడు. వడదెబ్బగానీ తగిలిందో ఏంటోనని నాలుగైదు రోజులు నాన్న ఒకటే కంగారు పడ్డాడు"అన్నాడు చైతన్య.

తమ ఇంట్లోని వారంతా ఎంత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారో తెలిసిన శ్వేత ఏమీ బదులివ్వలేకపోయింది.

"వాళ్ల సంగతి వదిలేయ్. పెద్దమ్మ, వదినా, పెద్ద అన్నయ్య, పిల్లలూ అంతా బావున్నారా? అమ్మమ్మ ఎలా వుంది? లేచి తిరుగుతోందా? అమ్మమ్మని చూడాలని వున్నా రాలేని పరిస్థితి. తాతయ్యేమంటున్నాడు?"

"ఏమంటారు వాళ్లు? కాటికి కాళ్లు చాచుకొని వున్న మమ్మల్నొదిలి మా పిల్లనెందుకు తీసుకుపోయావు? నవ్వుతూ కలిసి వున్న రెండు కుటుంబాల్లో ఈ చిచ్చు ఎందుకు లేవదీశావు అంటూ ఏడవని రోజు లేదు. దీనికంతటికి పాపిష్టివాడిని నేనే మూలకారణం". తల కొట్టుకుంటూ అన్నాడు చైతన్య.


"ఏంటన్నయ్యా నువ్వు కూడా. నువ్వు చేసిందేముంది? ఆ టైంలో నాన్న బైక్ ఎక్కినా అమ్మకి యాక్సిడెంట్ జరిగి వుండేదేమో! ఏదో దేవుడి దయ వల్ల నువ్వు పక్కకి పడిపోయావు. అమ్మ బస్ కింద పడింది. అక్కడ ఆ టైమ్‌లో చూసిన నా ఫ్రెండ్ చెప్పిందిలే. మా దురదృష్టం వల్ల అమ్మ పోయింది. అమ్మెప్పుడూ మాతో అనేది-కాలూ చెయ్యి సవ్యంగా వున్నప్పుడే పోవాలి. కానీ మంచాన పడి కాదు అని. తను కోరుకున్నట్లుగానే పోయింది" గొంతు జీరబోతుండగా అన్నది శ్వేత, చైతన్యకి కొంత సాంత్వన కలిగించడానికి.

"గుళ్లో దర్శనం ఎంత తొందరగా అయింది. మనం చాలా అదృష్టవంతులం అంది పిన్ని-ఆమె ఇంకా ఏదో చెప్పబోతూనే వుంది-ఆటో వాడిచ్చిన జర్క్‌తో స్కూటర్ మీద వున్న తను మా మీద పడడం వరకే తెలుసు. ఆ తర్వాత హాస్పిటల్లో స్పృహ వచ్చిన నాకు మరుసటి రోజుక్కానీ ఈ దుర్వార్త తెలీలేదు. నేనెంతగానో ప్రేమించిన పిన్నిని ఆఖరు చూపు చూసే భాగ్యానిక్కూడా నోచుకోలేకపోయాను చిన్నారీ! ఇదంతా తలుచుకున్నప్పుడు మనసంతా తూట్లు పడినట్లు అవుతోంది. వర్క్‌లో కూడా కాన్సన్‌ట్రేషన్ చేయలేక పోతున్నాను. అమ్మ అటు తన ముద్దుల చెల్లెల్ని పోగొట్టుకున్నందుకూ, నేనిలా తయారవు తున్నందుకూ ఒకటే దిగులు పడుతోంది. చిక్కిశల్యమైపోయింది. ఇప్పుడు నువ్వు అమ్మను చూస్తే గుర్తుపట్టలేవు

అలాగైంది'' నిట్టూరుస్తూ అన్నాడు చైతన్య.

''అయ్యో! అలాగా అసలే పెద్దమ్మకు బిపి. మందులవీ సరిగ్గా వాడుతోందా? ఒకసారి ఇంటికొద్దామని ఎంతో అనుకున్నాను. నన్ను చూసి మళ్లీ ఏడుపు మొదలుపెడుతుందని రాలేదు.''

''నువ్వేమో అలా అనుకొని రాకపోతే తను మరోలా అనుకుంటోంది. మేమంతా వచ్చినప్పుడు బాబాయ్ తన రూమ్‌లోకి వెళ్లి గొళ్లెం పెట్టేసుకున్నాడు. అక్క మమ్మల్ని చూసి మీ ఎదురింట్లోకి వెళ్లి రానేలేదు. చేసేదేం లేక తిరిగొచ్చేశాము. నాకు ఆడపిల్లల్లేనందుకు వాళ్లనెంత ఇదిగా చూశాను. అయినా నాలో వాళ్ల అమ్మని చూసుకోలేకపోయారని ఆ రోజంతా ఒకటే ఏడ్పు అనుకో. ఫలితంగా బిపి ఎక్కువై ఎడమ భుజం, ఎడమ కాలిలో పోట్లొచ్చేశాయ్. వెంటనే హాస్పిటల్‌లో చేర్చాం. సరైన ట్రీట్‌మెంట్ కరెక్ట్ టైంలో చేశారు కాబట్టి పెరాలిసిస్ రాలేదు అన్నాడు డాక్టర్లు'' అన్నాడు చైతన్య.



''అయ్యో...అలాగా!'' నిజంగానే బాధ ముంచుకొచ్చి అడిగింది శ్వేత. తన తల్లితో సాధ్యం కానివి పెద్దమ్మ ద్వారా సాధించినవెన్నో వున్నాయి మరి. 'పెద్దమ్మ గారాల కూచి' అనేవాళ్లు తనని. అందుకే సిన్సియర్‌గా బాధపడింది. ''ఇప్పుడెలా వుంది? రెగ్యులర్‌గా మందులు వాడుతోందా? రావాలంటే ఆదివారమే కుదురుతుంది. ఆదివారం వస్తే నాన్నకు తెలుస్తుందని భయం. కానీ నాకు మళ్లీ మన రెండు కుటుంబాలెప్పట్లా కలిసి మెలిసి వుండాలని ఎంత కోరికో చెప్పలేను'' అంది శ్వేత.

''నాకూ అదే ఆశ. నువ్వు ఇలా ఇప్పుడు మాట్లాడుతోంటే ఆ ఆశ నెరవేరుతుందని నమ్మకం కుదురుతోంది. వాళ్లకి నచ్చజెప్పి మళ్లీ మనమంతా కలిసిపోయేలా నువ్వు చేయాలి చిన్నారి'' అన్నాడు చైతన్య.

''నేనేం చేయగలనన్నయ్యా. ముందులా నాన్న మాతో చనువుగా వుంటే ఏదన్నా చెప్పగలిగేవాళ్లం. ఆఫీసులో ఎలా వుంటారో ఏంటో గానీ రాగానే తన రూమ్‌లోకి వెళ్లి ఒంటరిగా వుండిపోతారు. రమ్మని, మాతో టీవి చూడమని పిలిచినా రారు. ఇవాళ్టి దుఃఖం గానీ, కోపతాపాలు గానీ మర్నాటికి వుండవని పెద్దలంటారు. అందుకే రేపటి రోజు బావుంటుందన్న ఆశతో వుంటున్నాం'' అంది శ్వేత.

''ఎన్నో రోజుల తరువాత, కాదు, కాదు ఎన్నో నెలల తర్వాత ఇవాళ నాకు కొంచెం శాంతిగా వుంది. మన కుటుంబాల మధ్య ఏర్పడ్డ దూరం ఇక ఎప్పటికీ ఇంతేనా అన్న బాధకి తొందరలోనే ఓదార్పు లభిస్తుందన్న ఆశ'' అన్నాడు కాస్త తేట పడిన మనసుతో.


''నువ్వు ముందు పూర్తిగా కోలుకుని అమ్మమ్మ, తాతయ్యలకి, పెద్దమ్మ పెద్దనాన్నలకి ధైర్యం చెప్పు. అందర్నీ అడిగినట్లు చెప్పు. అదిగో నా బస్ వస్తోంది. మరి వెళ్లనా?''

''ఆ....సరే జాగ్రత్త'' అన్నాడు చైతన్య.

***

లోపలకి అడుగుపెడుతూ తొంగి చూసింది శ్వేత. తండ్రి మోహన్‌రావ్ జాడ లేకపోయేసరికి కాస్త రిలాక్స్ ఫీలయినా, అంతలోనే భయపడింది. ఇంతకు ముందు ఏదో అకేషనల్లీ అడపాదడపా తాగే తన తండ్రి, తల్లి పోయిన దగ్గర్నుంచీ మద్యపానానికి బాగా అలవాటు పడ్డాడు. తాగి బయట ఎక్కడన్నా పడిపోతే ఎలా అని

తామంతా మొత్తుకుంటే... ఇంటికొచ్చి తాగడం మొదలుపెట్టాడు. ఎలా కట్టడి చేయాలో తెలీక తికమకపడడం తమ వంతవుతోంది. పొద్దుట లేచి స్నానపానాలు ముగించుకొని, ఆఫీసుకు నీట్‌గా వెళ్లే తండ్రి, సాయంత్రమయ్యేసరికి సొక్కి సోలి పోయేంత వరకూ తాగేస్తుంటే, ఏం చేయలేక ఎవరితో చెప్పుకోలేక అవస్థ పడడం మామూలయింది.



ఎవరితోనూ ఎప్పుడూ ఏదీ చెప్పించుకోని మనిషి ఇప్పుడింత బేలగా తయారయితే, అర్థం అవుతోంది తమకు భార్యాభర్తల బంధం ఎంత పటిష్టంగా వుంటుందో... అది చేజారితే ఎన్ని అనర్థాలు జరుగుతాయన్నది. తమకి వున్న పెద్దలు అమ్మమ్మ, తాతయ్యలు, పెద్దమ్మ, పెద్దనాన్నలే. తండ్రి తరపు వారెవ్వరూ లేరు. వాళ్లతో కాస్త మంచి చెడ్డా చెప్పిద్దామంటే మాటలే మానేశాడు. ముందు గీతతోటి, బావ ఆనంద్‌తోటి, వారి పిల్లలతోటి, అంతెందుకు పక్కింటి పిల్లలయిన పింకీ, రింకీలతో సమయమంతా గడిపే తండ్రి పింకీ, రింకీలతో అసలు మాట్లాడడమే లేదు.

''గీతా నువ్వయినా పిల్లలతో ఇక్కడ ఉండిపోవే'' అంటే....

''మీ బావకక్కడ వండిపెట్టే దిక్కుండదు. ఆయన్నిక్కడ వుండమంటే వుండరు. నేనేం చేయాలే'' అంటుంది. అదీ నిజమే మరి. ఆలోచనల్లోంచి తేరుకొని ''బాబ్జీ నాన్నింకా రాలేదేంట్రా?'' తన రూమ్‌లో చదువుకుంటున్న తమ్ముడినడిగింది శ్వేత ఆందోళనగా.

''ఆఫీసులో ఏదో అర్జెంట్ పని వుందట. లేట్‌గా వస్తానని ఫోన్ చేసి చెప్పారు'' అన్నాడు బాబ్జీ.

''అమ్మయ్య'' అనుకుంది తేలికపడ్డ మనసుతో. మరో అరగంటకల్లా మోహన్‌రావ్ వచ్చాడు. రావడంతోనే కాళ్లు చేతులైనా కడుక్కోకుండా తన గదిలోకి వెళ్లిపోయాడు. మెల్లిగా కిటికీలోంచి తొంగి చూసింది. మంచం మీద బోర్లా పడుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న తండ్రిని చూసేసరికి బాధ కలిగింది. తల్లిదండ్రులు ఎంతో అన్యోన్యంగా వుండే వాళ్లు. తల్లి అమాయకత్వం మీద జోకులేస్తూ ఆటపట్టించేవాడు. అమ్మ కాస్త బొద్దుగా వుంటుందని 'బోండాం' అంటూ పిలిచేవాడు. అమ్మ నిదానంగా పనిచేస్తుందని కోపం తెచ్చుకొన్నా ఆ మరునిమిషంలోనే చల్లబడేవాడు. అమ్మ ఎక్కడికైనా వెళతానంటే...'ఎక్కడకైనా వెళ్లు. కానీ, నేనొచ్చేసరికి ఇంట్లో కనిపిస్తే చాలు' అనేవాడు. ఏదన్నా ఊళ్లో ఫంక్షన్ వున్నా అంతే. అందుకే రాత్రి వుండవలసిన ఫంక్షన్లని అవాయిడ్ చేసేది అమ్మ.

''ఇంత వయసొచ్చినా ఒంటరిగా పడుకోలేడేంటి మీ ఆయన అంటూ మా వాళ్లంతా వెక్కిరిస్తున్నారు. కొందరైతే అంత అనుమానపు మనిషేంటే బాబూ అంటూ జాలి చూపిస్తున్నారు తెలుసా?'' అంటూ అమ్మ చిర్రుబుర్రులాడుతుంటే...

''మా ఆయన రామచంద్రుడు. ఒకే పత్నితో గడుపుతాడు. ఆయనది అనుమానం కాదు. అనురాగం అని చెప్పలేవూ. అయినా ఎవరేది అనుకున్నా లెక్కచేసేది లేదు. నా పెళ్లాం నా ఇష్టం''అనేవాడు మొండిగా.

ఠంచనుగా ఆరయ్యేసరికి ఇంటికొచ్చేయడం, కాస్త రిలాక్సయి ఆఫీసులోవి, దారిలో జరిగినవి అమ్మకి చెప్పడం. ఆ తర్వాత కాస్సేపు ఏదన్నా బుక్ చదువు కోవడం, భోంచేసి పడుకోవడం దాదాపు ఇదే దినచర్యగా వుండేది. ప్రతీ ఆదివారం అమ్మని మార్కెట్‌కి తీసుకెళ్లడం. వస్తూ వస్తూ హోటల్‌కో, సినిమాకో తప్పనిసరిగా తీసుకెళ్లడం అందరికీ తెలిసిన విషయం. 'మీ అమ్మానాన్న కొత్త పెళ్లికూతురు, పెళ్లికొడుకులాగా సరదాగా తిరుగుతూ ఎంజాయ్ చేస్తారని ఫ్రెండ్స్ అంటున్నారని చెపితే....

'మీరందరూ అదే పాటించండి. భార్యలోనే మంచి ఫ్రెండ్‌ని వెదుక్కోవాలి' అనేవాడు సరదాగా. అమ్మతో అంత డీప్ అటాచ్‌మెంట్ వున్న మనిషి కావడం వల్లనే, ఇంతగా కుమిలిపోతున్నాడు. గీతకు డిగ్రీ పూర్తి కాకముందే మంచి సంబంధం రావడంతో పెళ్లిచేసే సాడు. ఆ మరుసటి నెలలోనే గీత నెల తప్పిందని తెలియగానే ఎంతో సంబరపడ్డాడు. గీతకు ఎక్కడె క్కడి నుంచో రకరకాల తినుబండరాలూ, పళ్లు తెప్పించేవాడు. నెలలు నిండి గీతకు డెలివరి అయ్యేంత వరకూ తెగ ఆరాటపడ్డాడు. గీతకు కవల పిల్లలు మగపిల్లలు పుట్టినప్పుడు ఆనందంతో దాదాపు పిచ్చివాడే అయ్యాడు. మనవళ్లతో గడప డానికి ఏవో వంకలు పెట్టి, ఏదో విధంగా అల్లుడు కూతుర్ని, మనవలు వచ్చేలా చేసేవాడు. మావగారి ప్రేమనర్థం చేసుకున్న అల్లుడు ఆనంద్ ఎప్పుడన్నా విసుక్కున్నా అతను పిలిచినపుడల్లా తనకు వీలు గాని పక్షంలో పెళ్లాం, పిల్లల్ని ఆటో ఎక్కించి పంపేవాడు.

''మనం అనవసరంగా ఇంటద్దె కడుతున్నాం. మీ అమ్మావాళ్లింట్లోనే నెలకి ఇరవై అయిదు రోజులు గడిపేస్తున్నాం'' అని గీతతో సరదాగా అనే వాడు. అలాంటిది అత్తగారు పోగానే తన చుట్టూ తనే ఓ షెల్ నిర్మించుకొని అందులోనే ముడుచుకు పోతున్న మామగారిని చూస్తూ బాధపడుతున్నాడతను.

''పిల్లలూ తాతతో ఆడుకోండి'' అంటూ గీత పిల్లలను పంపబోయినా...

''వద్దమ్మా- పిల్లలకు ఈ వాసన మంచిది కాదు. వారిని నా దగ్గరకు పంపకు. ప్రేమను పెంచుకుంటే

మిగిలేది విషాదమే. నాకెవరితోనూ ఎటువంటి అనుబంధాలు వద్దు'' అని చెప్పేసాడు నిష్కర్షగా. దాంతో గీతా ఆనంద్‌లు మునుపట్లా రావడం తగ్గించేశారు. స్నేహితులు ''మోహన్ నీకింకా ఇద్దరు పిల్లల బాధ్యత వుంది. ఇలా పట్టించుకోకుండా వుంటే ట్లా?'' అని మందలించబోతే...

''ఏదీ మన చేతుల్లో లేదని చెప్పిందిగా నా రూప. అందుకే ఏదీ ఎలా జరగాలని రాసి వుంటే అలా జరుగుతుందనుకొంటున్నాను'' అని అనడం మొదలు పెట్టాడు. తండ్రి అలా మారిపోతూ వుంటే నిస్సహాయంగా భరించడం నేర్చుకుంటున్నారు శ్వేతా, బాబ్జీలు.

''నాన్నా కొంచెం తిని పడుకో నాన్నా'' అని పిలిచింది శ్వేత. మౌనంగా వచ్చి ఏదో తిన్నాననిపించి లేచాడు మోహన్‌రావ్. తను తినకుంటే వాళ్లు అభోజనంగా పడుకుంటారని తెలుసు.

***

ఆ మరుసటి రోజు లీవ్ పెట్టి కూకట్‌పల్లి వెళ్లింది శ్వేత. ఆమెను చూస్తూనే గొల్లుమంది రాజ్యలక్ష్మి. ''అమ్మమ్మ ఊరుకో! ఇలా ఏడుస్తావనే రాలేదిన్ని రోజులు'' ఏడుస్తూ అంది శ్వేత.

''మాకు ఏడ్పు కాక మిగిలిందేమిటమ్మా?'' విచారంగా అన్నారు జగన్నాథం గారు.

''తాతయ్య, అమ్మ ఒక్కతే మీ కూతురు గాదు. మీకు ఇంకా ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు, వారి పిల్లలం మేమందరం వున్నాం. మా అందరి కోసం మీరా దుఃఖాన్ని దిగమింగక తప్పదు'' అంది శ్వేత అతని చేతులు నిమురుతూ. ఇంతలో లోపల్నుంచి వచ్చింది వనజ.

''పెద్దమ్మా ఇందేంటిలా అయిపోయావ్?'' కళ్లల్లో నీళ్లు చిప్పిల్లుతుండగా అడిగింది శ్వేత.

''ఎలా వున్నావే తల్లీ? మీ నాన్నలో ఇంకా మార్పు అనేది రాకుంటే ఎల్లానే?'' అంటూ భోరుమంది.

''నేనొస్తే మీరిలా ఏడుస్తారనే ఎన్నోసార్లు వద్దామనుకునే రాలేదు'' అంది శ్వేత. ఓ రెండు గంటలు 'రూప' స్మృతులలో మునిగి పోయారంతా.

''మీ నాన్నకి గీత పిల్లలంటే ప్రాణం. వారి ద్వారానే అతడు మళ్లీ మామూలు మనిషవుతాడని మా నమ్మకం. వాళ్లని తరచూ రమ్మనమని చెప్పమ్మా'' అన్నాడు రాఘవేంద్రరావు.

''అలాగే పెద్దన్నా. ఇక మీదట అలా ట్రై చేస్తాం'' అంది శ్వేత. పెద్దవాళ్లంతా ఇచ్చిన సలహాలని భద్రపరచుకుంటూ...

***

''నాన్నా, ఆయనకి పదిహేను రోజుల పాటు క్యాంప్‌కి వెళ్లేదుంది. నువ్వు మాకు తోడుగా వుండడానికి తప్పక రావాలి'' అంటూ అడిగింది గీత ఫోన్‌లో. శ్వేత చెప్పినవన్నీ అమలులో పెట్టడానికి.

''మనింటిని వదిలి నేనెప్పుడన్నా ఎక్కడికన్నా వెళ్లానా? నువ్వు పిల్లల్ని తీసుకొని వచ్చేయ్'' అన్నాడు మోహన్‌రావ్.

''వాళ్లొస్తే మీద మీద పడతారు. నువ్వేమో'' అర్థోక్తిలో ఆగిపోయింది గీత.

''సరేలే! మీరున్నంత కాలం ఆ తాగుడు జోలికి పోను సరేనా!'' అన్నాడాయన.


అమ్మయ్య అనుకొన్నారు శ్వేతా, గీతలు. తండ్రి మాట ఇస్తే ఎలాగైనా నిలుపుకొంటాడు. గీత పిల్లలను తీసుకొని వచ్చేసింది. గీత పిల్లలయిన చింటూ, బంటూలకు ఎదురింటి పిల్లలు పింకీ, రింకీలకు బాగా స్నేహం. దాంతో మోహన్‌రావ్ వచ్చేసరికే ఇల్లంతా పిల్లలతో వారి ఆటపాటలతో నిండిపోయేది. ఒకట్రెండురోజులు అంటీ ముట్టనట్లుగా గడిపినా రాన్రానూ, అలవాటైపోయిన ఆ పిల్లలతో గడపసాగాడు మోహన్‌రావ్. చూస్తుండగానే రోజులు వేగంగా గడిచిపోసాగాయి. క్రమంగా తాగుడు తగ్గించేసాడు.

''నాన్నా! రేపటికి అమ్మ పోయి సంవత్సరం. గుళ్లో అన్నదానానికి డబ్బులు ఇచ్చాం. అక్కడకి మన మందరం వెడితే బాగుటుంది'' కాస్త నానుస్తూ అంది గీత. తండ్రి ఎలా రియాక్ట్ అవుతాడోననుకుంటూ.

''మీ అమ్మకు పదిమంది తింటేనే తృప్తి కలిగేది. మంచి పని చేస్తున్నారు. తప్పకుండా వెడదాం'' అన్నాడు మోహన్‌రావ్.

''అమ్మయ్య!'' అనుకున్నారంతా. వచ్చిన వాళ్లంతా తృప్తిగా తింటే ఎంతో సంతృప్తిగా అనిపించింది. గుడికి వచ్చిన రూప పుట్టింటివారిని, ఆమె మిగతా బంధుజనాన్ని చూసి పలకరించక పోయినా, కోపంగా చూడనందుకు అంతా రిలాక్స్‌డ్‌గా ఫీలయ్యారు.

మరో ఆరు నెలలూ కాలగర్భంలో ఇట్టే కలిసి పోయాయి.




''తాతయ్య-ఇవాళ అమ్మమ్మ పుట్టినరోజు కదా. మా అందరికీ ఐస్‌క్రీమ్ ఇప్పించాలి'' అడిగారు చింటూ, బంటూ.

''సరే పదండి'' అన్నాడు మోహన్‌రావ్. వాళ్లు వెడుతూంటే మేమూ వస్తామని వెంటబడ్డారు పింకీ, రింకీలు. చింటూ, బంటూలు ఐస్‌క్రీమ్ అడిగితే, పింకీ, రింకీలు కొత్తగా వస్తున్నదంటూ ఓ కూల్ డ్రింక్‌ని అడిగారు. ఎవరిక్కావలసింది వాళ్లకి ఇప్పించి ఇంటికి తీసుకు వచ్చాడు మోహన్‌రావ్. ఆ రాత్రి భార్య తలపులతో ఎంతకీ నిద్ర పట్టలేదతనికి. మాగన్నుగా నిద్రపడుతుండగా, పక్కింట్లోంచి ఏడుపులు వినిపించాయి. అంతా ఒక్క ఉదుటున లేచి వెళ్లారు. రింకీ, పింకీలు బయటకెళ్లి వచ్చిందగ్గర్నుంచీ వాంతులు, విరేచనాలూ చేసుకుంటూ, చూస్తుండగా కళ్లు తేలేసారని తెలిసింది. హుటాహుటిన హాస్పిటల్‌కి తీసుకెళ్లారు . ఆ పిల్లల తల్లి అయిన శాంతను పట్టుకోవడం కష్టమైంది. మోహన్‌రావు మూలంగానే పిల్లల ప్రాణం మీదకి వచ్చిందని తెలుసుకున్న ఆమె పుట్టింటి వాళ్లు నోటికొచ్చిన దుర్భాషలాడుతూ, ఒక దశలో మోహన్‌రావ్ మీద చేయి చేసుకున్నారు కూడా. ఆనంద్ వచ్చి అడ్డుపడకుంటే, మరింత గొడవ జరిగేదే. ఫోన్‌లో సంగతంతా విన్న చైతన్య వాళ్లందరూ వెంటనే వచ్చేసారు. ''నేనేం కావాలని చేసానా? పిల్లలడిగింది ఇప్పించాను గానీ'' బాధగా అన్నాడు మోహన్ రావ్. కూల్‌డ్రింక్ ద్వారానే పాయిజనయిందని తర్వాత తెలిసింది. ''ఎవరూ కావాలని చేయరు. పగలూ, ప్రతీకారాలూ ఉండేవాళ్లు తప్ప. కొన్ని అలా జరిగి పోతుంటాయ్. దాని వల్ల నిర్దోషులూ, దోషులుగా మిగలాల్సి వస్తుంది'' అన్నాడు రాఘవేంద్రరావు ఓదార్పుగా. ఆ మాటలు ఛెళ్లున తగిలాయ్ మోహన్‌రావ్‌కి.

రూప పోయినప్పుడు తను చైతన్యని, తన తోడల్లుడయిన రాఘవేంద్రరావ్‌ని ఎన్నెన్ని మాటలన్నాడీ గుర్తొకొచ్చి గిల్టీగా ఫీలయ్యాడు. తనెన్ని అన్నా, తనకి ఆపద జరగబోతోందని తెలియగానే, రక్షణగా అర్థరాత్రి అని కూడా చూడకుండా ఆగమేఘాల మీద వచ్చిన వారికి కృతజ్ఞతతో చేతులు జోడించాడు. చైతన్యను గుండెలకు హత్తుకొన్నాడు. చైతన్య తనకు తెలిసిన చిల్డ్రన్ స్పెషలిస్ట్‌ను పిలుచుకు రావడం, అతనిచ్చిన సజెషన్స్‌తో ట్రీట్‌మెంట్ చేయడంతో పిల్లల ప్రాణం దక్కింది. అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

**రెండేళ్ల అనంతరం....**

''కొన్ని ఇన్సిడెంట్స్ విషాదాన్ని మిగిలిస్తే, మరికొన్ని ఆనందాన్ని కలిగిస్తాయి అంటారు.అది మన కుటుంబంలో అందరికీ అనుభవం లోకి వచ్చింది. మొత్తానికి మళ్లీ మనమందరం కలిసాం ఇలా శ్వేత పెళ్లిలో. ఆనందాన్ని పంచుకొంటున్నాం'' అన్నాడు మోహన్‌రావ్. ఇప్పుడతను బాధ్యత తెలిసిన పూర్వపు మోహన్‌రావ్‌గా మారిపోయాడు మరి. 'భగవంతుడెవరికి నిర్దేశించిన పని వారు నిర్వహించి వెళ్లాల్సిందే. ఐతే కొందరు ముందుగా, మరికొందరు ఆ తర్వాత' అంటూ బాధల్లో వున్నవారిని పరామర్శించడం అతను కొత్తగా నేర్చుకొన్నాడు.

✱